

# రవ్వల నెక్లెస్

"అమ్మ ఉత్తరం రాసింది. అమ్మమ్మ ఆరోగ్యం బాగా లేదటా, ఓసారి వెళ్ళి చూసొస్తే బావుండు."

శ్రీవారు ఆఫీసు నుండి రాగానే చాయగ్లాసందిస్తూ నసిగాను. ఆయనో క్షణం నా కళ్ళలోకి చూసి

"అమ్మమ్మంటే ... మన పెళ్ళిలో ... రవ్వల నెక్లెస్ ధరించి టింగురంగా అంటూ తిరిగిన ఆ అరవయేళ్ళ అప్సర్సనే గదూ !" కుడిచేత్తో చాయగ్లాసందుకుని ఎడమ చేత్తో నా చెయ్యందుకో బోయాడు. అందుకేమీ ఆస్కారమివ్వకుండా ఆయన భుజాలమీద చేతులేసి సోఫాలో కూచోబెట్టాను.

"అవును ఆమెనే. మా అమ్మమ్మ అప్సర్సనే ... !"
గర్వంగా అంటూ నేనో కుర్చీనాక్రమించాను. నేనలా కూచోవడం ఆయనకేమి నచ్చనట్టుంది.

"హబ్బా ! నీ మెడలో మూడు ముళ్లేసి మూడేళ్లైంది. అయినా అంత దూరముంటావెందుకోయ్ ! వచ్చినాపక్కన కూచో సుజాతా !" చాయ్ సిప్‌చేస్తూ చెక్కిలి మీద చిటికేసిండు.

పక్కన కూచోవాలని నాగ్గూడా ఉంది కాని మగమహారాజుకు తొందరెక్కువ. పైగా మావారు శృంగార ప్రియులు. పక్కన కూచోగానే చక్కిలిగింతలు, చెంపలు నిమురుడు ... అబ్బో ! కథ చాలా దూరం వెల్తుంది ... తలుచుకుంటేనే సిగ్గేస్తుంది.

"ఆహా ! సిగ్గులతో నీ బుగ్గలు ఎర్రమందారాలైపోయినై తెల్సా ! ఏ వయసులో జరగాల్సిన అచ్చటా ముచ్చటా ఆ వయసులో జరగాలన్నారు గదా ... !"

"అంతేకాదు" సర్దుక్కూచున్నాను. "ఏ సమయములో జరగాల్సింది ఆ సమయంలోనే జరగాలని గూడా అన్నారు మహాప్రభూ ! ఇది పగలు... మా అమ్మమ్మ ఆరోగ్యం బాగా లేదని నేను బాధ పడ్తుంటే మీకు నవ్వులాటగా ఉందా?" కావాలనే సీరియసయాను.

"అమ్మో ... ఇక లాగించకు." చాయ గ్లాసు టీపాయ్ మీదుంచి దిగ్గున లేచాడు. "నువు మీ రవ్వల నెక్లెస్ అమ్మమ్మను చూసొస్తానంటే నేను వద్దంటానా! నీ ఇష్టం డియర్ !" అంటూ షెటల్‌కాక్ రాక్ పట్టుకుని వెళ్లిపోయిండు.

అమ్మమ్మ అనగానే ... కొత్తపల్లి గ్రామం గుర్తుకొస్తుంది. గడిచిపోయిన దృశ్యాలు మనసు తెరమీద తచ్చాడుతాయి. కరీంనగర్ జిల్లాలో కడగొట్టు పల్లెటూరు కొత్తపల్లి ... చాలా పాత ఊరే. పెద్ద చెరువు కట్ట, నగరేశ్వరాలయం, ఆలయం చూట్టూ ప్రహరీగోడ, గోడ పక్కన పూలమొక్కలు, ఊరు చుట్టూ పచ్చని పొలాలు చూడ ముచ్చటగా ఉంటుంది.

చిన్నప్పుడు సంక్రాంతి, దసరా, ఎండాకాలం సెలవులన్నీ అక్కడే గడిచేవి. మా అన్నయ్యా, నేను, మా పిన్ని కూతురు ... మరికొందరు పిల్లలమంతా కలిసి పగలంతా మామిడి తోటలో గడిపేవాళ్లం. దాగుడు మూతలు, కోతికొమ్మ,

చిర్రాగోనే, కబడ్డీ .. ఎన్ని ఆటలో ! సంధ్యాసమయం చీకటి పరదాలు దిగుతుంటే, మేతకెళ్లిన పక్షులు కిలకిలారావాలు రువ్వుకుంటూ తిరిగొస్తుంటే, గోధూళిలో గంతులేసుకుంటూ పాటలు పాడుకుంటూ ఇల్లు చేరుకునేవాళ్లం.

అమ్మమ్మ, తాతయ్య మమ్మల్నెంత గారాబంగా చూకునేవారో ! మా ముగ్గుర్నీ వరుసగా కూచోబెట్టి ఏవేవో కబుర్లు చెబుతూ, కథలు వినిపిస్తూ అమ్మమ్మ గోరుముద్దలు తినిపించేది. అమ్మమ్మ కలిపిన పెరుగన్నం అమృతంలా ఉండేది. తాతయ్య మాత్రం తక్కువ తిన్నాడా ? మామిడి పళ్లో, అరటి పళ్లో, సీతా ఫలాలో... రోజుకో రకం పట్టుకొచ్చి మమ్మల్ని ఆడిస్తూ తినిపించేవాడు. మాతో పాటు తానూ ఆడుకునేవాడు.

అన్నట్టూ... అమ్మమ్మకు ఇద్దరూ కూతుళ్లే. మగ సంతానం లేదు. అందుకేనేమో ... మా అన్నయ్యను తెగ మెచ్చుకునేది. అది తిను, ఇది తిను అంటూ తినుబండారాల్లో వానికి ఎక్స్ట్రా కోట అందించేది. వాడేమో "నాకొద్దుపో!" అని విసిరి కొట్టేవాడు. అయినా కోపగించుకునేది కాదు.

అమ్మ, పిన్ని పెళ్లిల్లయాక తాతయ్యకు మిగిలింది ఐదెకరాల పొలం, ఇల్లు ... అంతేనట.

తాతయ్య షష్ఠిపూర్తి ఉత్సవాలు ఘనంగా జరిగినై. అమ్మమ్మ తాతయ్యలు సిగ్గులు సింగారించుకుని పెళ్లిపీటల మీద కూచున్న ఆ తీరు చూడాలి ! వాళ్లసలు ముసలోళ్లన్న సంగతి మరిచిపోయుంటారు. హుషారుగా దండలు మార్చుకున్నారు. సన్నాయి రాగాలు అమ్మమ్మ ఒంటినిండా పులకలు పూయించాయేమో - కొత్త పెళ్లి కూతురులా మెలికలు తిరిగి పోయింది. ఆ సొగసులు, ఆ హొయలు అబ్బో ... మేమంతా ఊరకే ఉండలేక పోయాం.

ఆనంద ఆనంద మాయనే
మా అమ్మమ్మ పెళ్లి కూతురాయెనే
ఆనందమానంద మాయెనే
మా తాతయ్య పెళ్లి కొడుకాయెనే ....

అంటూ మేం ముగ్గురం పాడుకుంటూ వాళ్లనో ఆట పట్టించాం. అప్పుడన్పించింది... మొహాల మీద ముడతలు లేకపోతే అమ్మమ్మ - తాతయ్యలు అపర రంభా - నలకూబరులని.

ఆ శుభ సందర్భంగా తళతళలాడే రవ్వల నెక్లెస్ ... తెల్ల, ఆకుపచ్చ, ఎర్ర రాళ్లు పొదిగిన మేలిమి బంగారు రవ్వల నెక్లెస్‌ను అమ్మమ్మ మెడలో తాతయ్య అలంకరిస్తూంటే - బంధుమిత్రుల మొహాలన్నీ ట్యూబులైట్లలా వెలిగిపోయినై. అమ్మ, పిన్ని మొహాలైతే ఆశ్చర్యంతో ఇంద్రధనుస్సులై పోయినై. ఆ తర్వాత తెలిసింది - తాతయ్య ఓ ఎకరం పొలం అమ్మేసి ఆ నగ చేయించాడని. ఇంటి కొచ్చాక

"ఆ పొలం అట్లానే ఉంటే నాకో అరెకరం వచ్చేది." అమ్మ నాన్నతో అంది - కష్టపడి సంపాదించిన ఆస్తినెవరో దోచుక పోయినట్లు ఇదైపోతూ.

"ఆఁ... దాందేముంది. ఏదో ఉపాయంతో దాన్ని నువ్వే సొంతం చేసుకుంటే పోలా ?"

నాన్న సలహాతో అమ్మ మొహం చేటంతయింది. అప్పటికే నాకు పెళ్లి ఖాయమైంది.

నా పెళ్లి రేపనగా అమ్మమ్మను బుజ్జగించి అడిగింది అమ్మ. "అమ్మా ! ఆ రవ్వల నెక్లెస్ చాలా బాగుంది. పడుచు వాళ్ల మెడలో ఉంటే అదింకా బాగుంటుంది. దాన్ని నాకివ్వే." కాస్సేపు గారాలు పోయింది. "దాన్ని నేను మన సుజాతకు పెళ్లికానుకగా ఇచ్చేస్తా. భవిష్యత్తులో అది సుజాత కూతురుకూ, ఆ తర్వాత మనవరాలుకూ చెందుతుంది. ఈ విధంగా నీపేరు తరతరాలుగా మోగిపోతుందే".

పాచిక బాగానే వేసింది, కాని ఏం లాభం ?

బటన్ నొక్కగానే ఆగిపోయిన మిషన్‌లా అమ్మమ్మ చేష్టలుడిగిపోయింది. మొగిలి పూవులాగున్న మొహం మధ్యాహ్నం కలువలా ముడుచుకుపోయింది.

"నేను బతికున్నంత వరకు ఈ రవ్వల నెక్లెస్ నన్ను అంటిపెట్టుకునే ఉంటుంది" కరాఖండిగా చెప్పేసింది. మా పిన్ని ఏమన్నా తక్కువ తిన్నదా ?

"అక్కా ! కొంతకాలమాగవే ! నా కూతురు కోసం దాని పెళ్లిలో ప్రయత్నిద్దాం" లైను వేసేసింది.

అమ్మ మొహంలో మారిన రంగులు చదివితే - ఆ మాటలు మింగుడు పడలేదని అర్థమైపోతుంది. పెళ్లి సందడిలో అది చిలికిచిలికి గాలివాన అవుతుందేమోనని నాకు భయమేసింది.

"పోనీలేవే అమ్మా ! ఆ సంగతి మరెప్పుడన్నా ఆలోచించవచ్చులే !" సర్ది చెప్పేశాను.

నా పెళ్లైన ఆర్నెల్ల తర్వాత మా పిన్ని కూతురు పెళ్లయింది. నిజం చెప్పొద్దూ! ఆ రవ్వల నెక్లెస్ నాకే సొంతం కావాలని మనసు మారాము చేస్తోంది. మా పిన్ని కూతురు పరిస్థితి గూడా అంతే ఉన్నట్టుంది. ఓసారి మనవరాళ్ల మిద్దరం కలిసి అడిగాం అమ్మమ్మను. గారాబంగా మా వీపులు నిమిరి

"పిచ్చి పిల్లలూ ! ఈ నగ నా ప్రాణం. ఇది నా మెడలో కనిపించక పోతే మీ తాతయ్య పిచ్చోడై పోతాడు. అయినా ... మా తర్వాత మా పొలమూ పుట్ర వగైరాలన్నీ మీ అమ్మలక్కాక ఇంకెవరికి కుంటాయి ?" అనేసి నుదుర్లు ముద్దాడింది.

హమ్మో ! ముసల్ది ఘటికురాలే ! ఎక్కడన్నా బావా అంటే ఒప్పుకుంటాను, వంగతోటకాడన్నావంటే తప్పుకుంటాను అనేట్టుంది. మొహాలు చూసుకుని నవ్వు కోవడం మా వంతైంది.

సమయ సందర్భాలొచ్చినప్పుడల్లా మా ప్రయత్నం కొనసాగుతూనే ఉంది...

అమ్మమ్మకు వృద్ధాప్యంగదా ! అప్పుడప్పుడు అనారోగ్యం, తిరిగి బాగవడం మామూలే గదా ! ఆరోగ్యం బాగాలేదని ఇప్పుడే వెళ్లి కూచుంటే - మహా అయితే నాలుగైదు రోజులుండొచ్చు. ఆ తర్వాత నేనిటురాగానే అటు అమ్మమ్మకేదన్నా అయితే... ఆ రవ్వల నెక్లెస్ ఎవరి చేతికెల్తుందో ! చూద్దాం. కొద్ది రోజుల తర్వాత పరిస్థితి అంచనా వేసి స్టెప్ తీసుకుకోవచ్చు ...

రంగుల రవ్వల నెక్లెస్ కళ్లనిండా కదిలింది.

❀ ❀ ❀

కార్గిల్ మంచుకొండల్లో కార్చిచ్చు దావానలమైంది. శత్రుమూకల పీచ మడగించేందుకు యుద్ధం నడుస్తోంది. భారత వీర జవానులు ప్రాణాలకు తెగించి పోరాడుతున్నారు. యుద్ధం చివరి దశలో ఉంది... రోజూ అర్ధరాత్రి వరకూ టీ.వి. వార్తలు ఆసక్తిగా వింటున్నాం.

భరతజాతి సత్వమ్మును
పరీక్షించ బోకుము, అది
సహనానికి ఏలిక
సమరానికి కాళిక ...

సి.నా.రె. కవి వాక్కులను మననం చేసుకుంటూ విదేశీ కిరాతక, కిరాయి సైనికుల మదమణిగి పోవడం ఖాయమని ముచ్చటించుకుంటున్నాం.

తెల్లవారకముందే ఫోన్ మోగింది.

"కమ్మని నిద్ర ఖరాబైపోయింది డియర్ ! ఫోన్ అరిచి అరిచి నోర్మూసు కుంటుందిలే !" శ్రీవారు వదలడం లేదు.

"అబ్బా ... ఎవరో ! చూసొస్తానండీ." పట్టు సడలించే ప్రయత్నం.

"ఆఁ ... ఎవరో కాదు ... మా ఆఫీసరయ్యుంటాడు. వానికి ఆస్తమానం ఆఫీసు ఫైళ్లే కళ్లల్లో తిరుగుతుంటై. ఏదో అదనపు పని పురమాయించాలనో, ఎటన్నా క్యాంపు వెళ్లాలనో చెప్తాడంతే. నువు పడుకో సుజా !"

పెళ్లై మూడేళ్లు దాటినా, ఆరు నెలల్లో తండ్రి కాబోతున్నా ఆయనింకా కొత్తపెళ్లి కొడుకే ... నవ్వొచ్చింది. కాని ... ఫోన్ అటెండవక పోవడం అన్యాయం గదా !

"ఇప్పుడే వస్తాగా !" బలవంతంగా వచ్చేసి ఫోనెత్తాను.

"హలో !"

"హలో ... సుజాతా !"

"అవునమ్మా నేనే, అబ్బా ... ఇంత పొద్దున ... ఏం కొంపలంటుకు పోయాయనీ !" విసుగన్పించింది.

"అమ్మమ్మ రాత్రి చనిపోయిందే మొద్దు మొహమా ! నేనూ మీనాన్న కొత్తపల్లి లోనే ఉన్నాం. నువు తొందరగా వచ్చెయ్..." పిడుగు లాంటి వార్త.

నా నవనాడులు ఒకేసారి కుంగిపోయినై.

అరెరే ! నన్ను తన గుండెలమీద ఆడించిన అమ్మమ్మ కమ్మని కథలు చెప్తూ గోరుముద్దలు తినిపించిన అమ్మమ్మ ... ఇక లేదు. గుండె గోడల్ని ఎగబాకుతూ దుఃఖం ఎగజిమ్ముకొచ్చింది. అది లావాలా తోసుకొచ్చింది.

"అమ్మమ్మా !" బోర్మన్నాను. నిలదొక్కుకోలేక పోతున్నాను. ఆయన కంతా అర్థమైందేమో - పరుగెత్తుకొచ్చి నా భుజాలందుకున్నారు.

"మామూలు అనారోగ్యమనుకున్నాను గాని ... ఇంత పంజేస్తుందను కోలేదండీ." ఆయన గుండెలమీద వాలిపోయాను. హృదయాంతరాళాల్లో దుమారం ...

"పిచ్చి సుజా ! పుట్టిన ప్రాణి గిట్టకమానదు ... " తో ప్రారంభించి ఏవేవో మాటలు చెప్పి ఉపశమనం కలిగించారు. వెంటనే ఆయనతో బయలుదేరాను. పిన్ని కుటుంబమంతా అక్కడే ఉంది. దగ్గరి బంధువులంతా చేరుకున్నారు.

పాపం తాతయ్య ! వీపు గోడకానించి, మోకాళ్ల మధ్య తలదూర్చి శోకమూర్తిలా కూచున్నాడు. చూపులు శూన్యంలో ... చెంపల మీద ఇంకిపోయిన కంటి ధారలు ... అమ్మమ్మనే తోడూ నీడా. అమ్మమ్మతో యాభయ్యేళ్ల సహజీవనం... చెట్టు - నీడ, చంద్రుడు - వెన్నెలలా కలిసున్నారు. ప్చ్ ... ఇప్పుడు ఒంటరి పక్షయాడు... గుండె పొంగుకొచ్చింది.

"తాతయ్య ! అమ్మమ్మేదీ ? ఎక్కడికి పంపించావ్ ?" చేతులందుకుని గొల్లుమన్నాను. తాతయ్య బావురు మన్నాడు.

"మీ అమ్మమ్మ దేవతైపోయింది సుజాతా ! నే .... నేను మానవ మాత్రుడిని గదా ... నన్నొదిలి వెళ్లిపోయిందమ్మా ..." వెక్కి వెక్కి రోదిస్తున్న తాతయ్య నూరడించడం నా తరమా ! శ్రీవారు ముందుకొచ్చి ఊరడించారు.

నుదట రూపాయి బిళ్లంత బొట్టు, మెడలో రవ్వల నెక్లెస్‌తో అమ్మవారిలా కళకళలాడిన అమ్మమ్మ శవమై చితిమంటల కాహుతైపోతుంటే నా నవనాడులు కుంగిపోయినై. మేమంతా విలవిల్లాడి పోయినం.

అంతా ఐపోయింది. ఉన్నవాళ్లు పోయినోళ్ల తీపిగురుతులని సరిపెట్టుకోక తప్పలేదు.

సందు దొరికితే చాలు, చాటు దొరికిందే ఆలస్యం ... పిన్ని తన కూతురుతో, పిన్ని కూతురు తన భర్తతో, వదిన అన్నయ్యతో, అమ్మ నాన్నతో గుసగుసలు పిసపిసలు. అందరి సబ్జెక్టు రవ్వల నెక్లెసే. నాగ్గూడా... అదే కావాలి. కాని ... ఎలా ? శ్రీవారికి సైగచేసి గదిలోకి పిలిచాను.

"ఆ రవ్వల నెక్లెస్ మనకే రావాలి. ఏదన్నా ఉపాయమాలోచించండి. వాళ్ల ఎత్తులన్నీ చిత్తైపోవాలి..." చెవిలో చెబుతున్నాను.

"చిఛీ... నోర్మూసుకో !" ఆయన నా కళ్లలోకి తీక్షణంగా చూసి తప్పుకున్నారు.

దశదినకర్మ, పిండప్రదానం లాంటి క్రతువులైపోయినై.

భోజనాలవీ అయేసరికి నాలుగైంది. సాయంత్రం చాయలు సేవిస్తూ వసారాలో కూచున్నామంతా. మానవజన్మ, పునర్జన్మ, పాపపుణ్యాలు, అమ్మమ్మ నియమనిష్ఠల గురించి కాస్సేపు చర్చజరిగింది. ఆ తర్వాత ... సందర్భాన్ని కల్పించుకుని పిన్ని ప్రస్తావించింది.

"నాన్నా ! రవ్వల నెక్లెసన్నా, నేనన్నా అమ్మకెంతో ఇష్టం. అది నాకే చెందాలని అమ్మ ఎన్నోసార్లు అనేది..."

పడక్కుర్చీలో కూచున్న తాతయ్య తల షడెన్‌గా పైకి లేచింది. పిన్ని నదో రకంగా చూసి కళ్లు దించుకున్నాడు. పెదాల మీద నిర్వేదమైన చిరునవ్వు ఛాయలు కన్పించినై.

"అదెట్లా ! నేనీ ఇంటికి పెద్దాడపడుచును. అది నాకే చెందుతుందని అమ్మ మా సుజాత పెళ్లిలో చెప్పింది ... బహుశః నీగ్గూడా చెప్పుంటుందనుకో ..." అమ్మ వాదన.

అమ్మను తేరిపార చూసిన తాతయ్య పెదాలు వేదాంత ధోరణిలో కదిలినై. ఆ తర్వాత దృష్టి అన్నయ్య వైపు మళ్లింది. ఆ చూపుల్ని చదివితే "ఏరా ! నీకేమీ చెప్పలేదా మీ అమ్మమ్మ ..." అనే భావమెనున్నంది. అన్నయ్య అమాయకుడనుకున్నాను... కాని వాని నోరు విచిత్రంగా తెరుచుకుంది. అప్పటికే వదిన సైగ చేసుంటుంది.

"అది కాదు తాతయ్యా ! ఆ రవ్వల నెక్లెస్ అమ్మకిస్తే దాన్ని తనింటి కోడలు కందజేస్తుంది గదా ! ..." ప్రపోజల్ మూవ్ చేసిండు.

అమ్మో ! వాని పెళ్లై సంవత్సమైందో కాలేదో ... అప్పుడే పెళ్లానికి రవ్వల నెక్లెస్ కావాల్సి వచ్చిందా ! ఎగబడాలన్పించింది. నా ముఖ కవళికల్ని గమనించి మెదలకుండా కూచొమ్మని శ్రీవారి సైగ అందింది.

పిన్ని కూతురు, దాని మొగుడు ఆ నగ వాళ్లకే చెందాలని వాదించారు. నా వాదన విన్పించక పోతే, నేనేమీ అనక పోతే ... బాబోయ్ ! యాభైవేల రూపాయల నెక్లెస్... మేలిమి బంగారు రవ్వలనెక్లెస్‌ను ఎవరో ఒకరు ఎగరేసుకు పోరా ! ఏమన్నా అందామంటే శ్రీవారి సైగ... అయ్యో ... పిచ్చెక్కి పోతుంది. జుట్టు పీక్కోవాలన్పించింది.

"ఆ నగనోసారి చూడాలనుంది నాన్నా !" చిన్నపిల్లలా అడిగింది పిన్ని, అయ్యో ! చూపించగానే దాన్ని పిన్ని అమాంతం లాక్కోదు గదా !

నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడ్తున్నారు. తాతయ్య ఓపిగ్గా వింటున్నాడు.

మాటలు వినీ వినీ విసుగొస్తుంది.

"ఏం నాన్నా ! అట్లా బెల్లంగొట్టిన రాయిలాగున్నావేందీ?" అమ్మకు కోపమొస్తున్నట్టుంది.

"నేనేం మాట్లాడాలి ?" సన్యాసిలా నవ్వేసి సర్దుక్కూచున్నాడు తాతయ్య. "నా తర్వాత పొలమూ పుట్రా, ఇల్లు మీకిద్దరికీ చెరిసగం చెందుతాయి గదమ్మా!"

"అద్సరే... ఆ రవ్వల నెక్లెస్ సంగతేమిటి తాతయ్యా ! ..." అన్నయ్య నిలదీసిండు.

"కార్గిల్‌లో అంతపెద్ద యుద్ధం జరుగుతుంది గదరా !" తాతయ్య వాలకం గంభీరమైంది.

"అబ్బా ... తలాతోకలేని ఆ సంగతి వదిలేసి అసలు విషయం చెప్పేయ్ నాన్నా !" పిన్ని గొంతు స్థాయి పెరిగింది.

"అదే చెబుతున్నాను ..." తాతయ్య గొంతు గూడా పెరిగింది. "అస్తమానం నా ఇల్లు, నా సంసారం, నా పిల్లలు ... ఇవే ఆలోచించాలా ? మంచుకొండల్లో మన వీరజవానులు ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్నారు గదా ! దేశం గురించి, వాళ్ల గురించి ఆలోచించి తీరాలిగదా ! మీ అమ్మకు, మీకు అత్యంత ఇష్టమైన ఆ రవ్వల నెక్లెస్‌ను మీ అమ్మనే దేశరక్షణ నిధి కిచ్చేసింది." తాతయ్య మొహం మతాబాలా వెలిగి పోతోంది.

అందరూ అవాక్కయారు.

అమ్మమ్మ ఆలోచన ఎంత గొప్పది ! అమ్మమ్మ ఎవరెస్టు శిఖరం ... మేమంతా ఎర్ర చీమలం ...

"అమ్మమ్మా !, నిజంగా నువు దేవతవైనావే !" మనసులోనే జోహార్లు అర్పించాను.

❀ ❀ ❀